క్లుప్తంగా

వైభవంగా గిరి ప్రదక్షిణ



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. గురు పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామ స్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తప్పిన ఇబ్బందులు



సుందరంగా ఎంపీపీ స్కూల్ ఆవరణ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ ఆవరణ సుందరంగా కనిపిస్తోంది. గతంలో మట్టి ఉండడంతో వర్షాలు కురిసేటప్పుడు నీరు చేరి ఆవరణ అంతా బురదమయంగా మారేది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడేవారు. అయితే ప్రాంగణంలో ఫ్లోరింగ్ చేపట్టారు. ఆకర్షణీయంగా రంగులు వేశారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ఉక్కునగరం: చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు జనరల్ ఆస్పత్రి సహకారంతో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. సబ్బవరం మండలం నంగినారపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్షలు చేయనున్నట్టు వైద్య మండలి ప్రతినిధులు జయంతి కుమార్, డాక్టర్ స్వరూప తెలిపారు. ఉచితంగా మందులు అందించనున్నట్టు చెప్పారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ మంగళవారం తెలిపారు. ప్లంబింగ్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుండి 45 సంవత్సరాల లోపువారు అర్హులని తెలిపారు. ప్లంబింగ్ కోర్సుకు 8వ తరగతి, ఎలక్ట్రికల్‌కు పదో తరగతి పాసై ఉండాలన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133242666,8309003957 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'చేనేత కార్మికులూ.. పేర్లు నమోదు చేసుకోండి'

మహారాణిపేట: సొంత మగ్గం ఉండి చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికులు ఈనెల 20వ తేదీలోగా ప్రాథమిక చేనేత సహకార సంఘంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్‌వీ మురళీకృష్ణ తెలిపారు. 30 మంది సభ్యులు ఉంటే తక్షణం నూతన ప్రాథమిక చేనేత సహకార సంఘం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఎక్కువ మంది సభ్యులు ఉంటే తమను నేరుగా సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని చేనేత కార్మికులు వినియోగించుకోవాలని, చేనేత సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం ఇచ్చే థ్రిఫ్ట్ సేవలు, బీమా సౌకర్యాలు, నూలు రాయితీ, ఆప్కాబ్ ద్వారా వస్త్రాల కొనుగోలు, వృత్తిలో శిక్షణ, ముద్రా రుణాలు పొందడానికి అర్హత పొందవచ్చన్నారు.

చిట్టినాయుడు కాలనీలో.. కరెంట్ కష్టాలు!

- లోఓల్టేజీతో నిత్యం ఇబ్బందులు
- ముందుకు సాగని పనులు
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



చిట్టినాయుడు కాలనీ కొండవాలు ప్రాంతం



పాడైపోయిన విద్యుత్ స్తంభం

గాజువాక: పాతగాజువాక దరి చిట్టినాయుడు కాలనీ కొండవాలు కాలనీవాసులను లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ కాలనీలో ఇప్పటికీ సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ ఉండడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. అర్ధరాత్రి సమయాల్లో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా తగ్గిపోవడం, కనీసం ఫ్యాన్లు కూడా తిరగని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరోపక్క గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయడంతో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు బాధ్యతలను ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ వ్యవహారం దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మిగిలిపోయింది. ఆర్భాటంగా పని ప్రారంభించిన కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాల కోసం గోతులు తవ్వి తర్వాత కనిపించడం మానేశారు. దీంతో తమ కరెంట్ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని కాలనీవాసులు వాపోతున్నారు.

త్రీ ఫేజ్‌తోనే పరిష్కారం

లోఓల్టేజీ సమస్య పరిష్కారం కావాలంటే ప్రస్తుతం ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ స్థానంలో త్రీఫేజ్ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అందులో భాగంగానే స్తంభాలు మార్చేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు మూడు నెలల కిందట ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. స్తంభాల కోసం గోతులు తవ్విన కాంట్రాక్టర్ కొండపైకి స్తంభాలు తీసుకురావడం కష్టమన్న కారణంతో పని చేయడం లేదు. విద్యుత్ స్తంభాలను కొండపైకి తీసుకురావడానికి అవసరమైతే తాము కూడా స్వచ్ఛందంగా పని చేస్తామని స్థానికులు చెప్పినప్పటికీ కాంట్రాక్టర్ మాత్రం స్పందించలేదు. దీంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. ఈ కాలనీ కోసం కేటాయించిన కొత్త విద్యుత్ స్తంభాలు కూడా ప్రస్తుతం వృథాగా పడి ఉన్నాయి. మళ్లీ రీటెండర్ పిలవాలని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.



తవ్వి వదిలేసిన గొయ్యి

నాలుగు నెలలుగా నరకం



నాలుగు నెలలుగా లోవోల్టేజీ సమస్య పెరిగిపోయింది. అధికారులకు చెబుతున్నా ఇదిగో అదిగో అంటున్నారు. అర్ధరాత్రి సమయాల్లో ఓల్టేజీ డ్రాప్ అయిపోతుండడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించాలి.

– యరజర్ల పంగిడయ్య, కాలనీవాసి

సహాయం చేస్తామని చెప్పినా..



కొండపైకి పొక్లెయిన్లు రావు కాబట్టి స్తంభాలను తీసుకురావడం కష్టమని కాంట్రాక్టర్ చెప్పారు. దాని కోసం మేమే సిబ్బందిని పెట్టి సహాయం చేస్తామని చెప్పాం. అయినా కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. మూడు నెలలుగా మళ్లీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం.

–నావన వెంకట రమేష్, కాలనీవాసి

స్తంభాలు పడిపోయే స్థితి



ప్రస్తుతం సింగిల్ ఫేజ్ ఉన్న మా కాలనీలో స్తంభాలు కూడా పాతవి కావడంతో కూలిపోయే స్థితిలో ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించాలి. జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.

– సీర సన్యాసినాయుడు, కాలనీవాసి

ఘనంగా భగవాన్ విశ్వకర్మ జయంతి



భెల్ టౌన్ షిప్‌లో విశ్వకర్మ పూజలో పాల్గొన్న ఈడీ జితేందర్ రెడ్డి



వీర బ్రహ్మేంద్ర, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశ్వకర్మ పూజలు చేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) టౌన్‌షిప్‌లోని కల్యాణ మండపంలో మంగళవారం భగవాన్ శ్రీ విశ్వకర్మ జయంతి పురస్కరించుకుని గోల్డెన్ జూబ్లీ పూజా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంస్థకు చెందిన శ్రీ విశ్వకర్మ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఇంజినీరింగ్ ఎండీ అరసవెల్లి సత్యనారాయణ దంపతులు పూజలు చేశారు. ఈడీ ఎస్.జితేందర్ రెడ్డి, జీఎంలు (హెచ్‌ఆర్) గౌరీశంకర్, ఫైనాన్స్ పట్నాయక్, సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్, కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, కరణం ముత్యాల నాయుడు, గుర్తింపు యూనియన్ నాయకులు బొండ బాబూరావు, డిప్యూటీ గౌరవ అధ్యక్షుడు, విశ్వకర్మ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లి దేముడు, సుభాకర్ సాహూ, వి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కులోని గోవిందమాంబ సమేత వీర బ్రహ్మేంద్ర, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ముద్దుర్తి శ్రీరామూర్తి, విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయ్, కణితి అప్పలరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కణితిలో..

అగనంపూడి: విశ్వకర్మ జయంతి సందర్భంగా 87వ వార్డు కణితి విశ్వబ్రాహ్మణ వీధిలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మందిరంలో ఘనంగా జయంత్యుత్సవాలు నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్‌లు పాల్గొని పూజలు చేశారు. వారు మాట్లాడుతూ సృష్టికర్త, విశ్వకర్మ భగవానుడన్నారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, చిత్రాడ రమణ, సామోజు నాగేశ్వరరావు, కణితి నాగేశ్వరరావు, కోమటి రమాదేవి, ఆదారి శ్రీను, కొమ్మోజు శేషు, విజయరామరాజు, రాజన్‌రాజు పాల్గొన్నారు.



శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న నాయకులు



విశ్వకర్మపూజల్లో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు,నాయకులు

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: ఆదిశిల్పి విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని మంగళవారం ఉక్కునగరంలో ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఏరియా విశ్వకర్మ భక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెక్టార్–5లోని మరిడిమాంబ ఆలయం సమీపంలో శాస్త్రోక్తంగా హోమాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడాలని పూజలు చేశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్.ప్రసాద్, డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్‌లు హాజరై పతాకావిష్కరణ చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ, ఉక్కు ఆస్పత్రి జీఎం డాక్టర్ సారంగి, వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, యు. రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, రామ్మోహన్‌కుమార్, వి. శ్రీనివాసరావు, కె.వి.డి. ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్లతో ఉడాయించిన దంపతులకు రిమాండ్

- నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ తుహిన్ సిన్హా
- కొద్ది రోజుల్లో మరో రెండు కార్లు స్వాధీనం చేసుకోనున్నట్టు వెల్లడి



మాట్లాడుతున్న డీసీపీ తుహిన్ సిన్హా

అగనంపూడి: కార్లను అద్దెకు తీసుకొని వాటిని తాకట్టు పెట్టి ఉడాయించిన దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నగర డీసీపీ తుహిన్ సిన్హా చెప్పారు. వారి నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న బుద్దా వీర మణికంఠ కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్నాడు. అతను కారు కొని ఖాళీ సమయంలో అద్దెకు తిప్పుతున్నాడు. రుణంపై కారు తీసుకున్న మణికంఠ సకాలంలో ఈఎంఐలు చెల్లించలేకపోవడంతో దాన్ని అమ్మేసి రుణం తీర్చాలని భావించాడు. ఈక్రమంలో ఓఎల్‌ఎక్స్ యాప్ ద్వారా కారు అమ్మడానికి పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న మల్కాపురానికి చెందిన దంపతులు ఎరుపల్లి రవీంద్ర, రూపాశ్రీ వీరమణికంఠను కలిశారని డీసీపీ వెల్లడించారు. కారు తమకు అద్దెకు ఇస్తే నెలవారీ రూ.35వేలు అద్దె చెల్లిస్తామని నమ్మబలికారు. ఇది నమ్మిన మణికంఠ వారికి అద్దెకు ఇచ్చాడని తెలిపారు. మొదటి నెల అద్దె డబ్బులు చెల్లించారు. తర్వాత నుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు ఫోన్‌కు అందుబాటులో లేకపోవడంతో బాధితుడు ఈ నెల 14న దువ్వాడ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారని ఆయన పేర్కొన్నారు. పోలీసులు జీపీఎస్ ద్వారా ట్రాక్ చేసి కారు ఆచూకీ తెలుసుకున్నారు. కాగా కారును అప్పటికే రెండున్నర లక్షలకు ఒక వడ్డీ వ్యాపారి వద్ద తాకట్టు పెట్టినట్టు గుర్తించారు. మణికంఠ కారుతో పాటు మరో కారు స్వాధీనం చేసుకొని నిందితులిద్దర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు. కొద్ది రోజుల్లో మరో రెండు కార్లను కూడా స్వాధీనం చేసుకోనున్నామని డీసీపీ వెల్లడించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోధనలో సాంకేతికతను జోడించాలి

డీఈఓ వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: బోధనలో మెలకువలు, వినూత్న పద్ధతులు అవలంబించడానికి పాఠశాలల సముదాయాలు దోహదపడతాయని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బోధనా రీతుల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, సాంకేతికతను వినియోగించుకొని బోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవడం, వాటికి అనుగుణంగా మానసిక స్థితిని మార్చుకోవడం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు ఎస్.వి.ఆర్.మూర్తి, డి.శ్రీనివాసరావు, ఎల్.వెంకటరావు పాల్గొన్నారు. తర్వాత పాఠశాల సముదాయాన్ని స్పోర్ట్స్ కాంపెక్స్‌ను పరవాడ మండల విద్యాశాఖాధికారి గౌంతిన సాయి శైలజ సందర్శించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ సందర్శన

ఇదే ఆవరణలో నిర్వహిస్తున్న క్రీడా సముదాయాన్ని డీఈవో వెంకటలక్ష్మమ్మ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఆటల్లో కొత్త నిబంధనలు వస్తున్నాయని, వాటిపై అవగాహన కల్పించుకోవడం కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ తప్పనిసరి అన్నారు. విద్యార్థుల క్రమశిక్షణతో నడిచేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అండగా ఉంటూ ముందుకు నడిపించే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లంకెలపాలెం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినోత్సవం



రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

అగనంపూడి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా 86వ వార్డు బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో అనంపూడి ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, ఆర్‌ఎంవో డాక్టర్ ఉషా, నాయకులు కోసూరి తాతారావు, కర్రి దశేంద్ర, బి.సత్యనారాయణ, చందు, ఆశాలత పాల్గొన్నారు.

- 86వ వార్డు బీజేపీ అధ్యక్షుడు తండాన వెంకటరావు ఆధ్వర్యంలో రామాలయంలో మోదీ పేరుతో అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామూర్తి, కృష్ణంరాజు, కె.వెంకటరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రొట్టెలు, పాల ప్యాకెట్ల పంపిణీ

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 70వ వార్డు శానిటరీ సిబ్బందికి ఆ వార్డు బీజేపీ అధ్యక్షురాలు దీనంకొండ పావని రొట్టెలు, పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీనివాస్, బెల్లంకొండ గణపతిరాజు, దండి అప్పలనర్సయ్య పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో మూగజీవాల బెడద



రోడ్డుపై ఆవుల మంద



రోడ్డుపై కుక్కల గుంపు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామంలో రోడ్లపై మూగజీవాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు పదుల సంఖ్యలో ప్రతీ వీధిలో దర్శన మిస్తున్నాయి. వీటి అరుపులతో రాత్రి సమయంలో అవస్థలు పడుతున్నారు. మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ మధ్య కాలంలో ఎక్కడ చూసినా ఆవుల సంచారం పెరిగింది. ఆవులను పెంచుతున్న వారు రాత్రి, ఉదయం పాలు తీసిన తర్వాత వాటిని విడిచి పెట్టేస్తున్నారు. అలా వదిలేసిన ఆవులు గ్రామంలో వీధుల్లో సంచరిస్తుంటాయి. కొందరు పూజల్లో ఉపయోగించే పండ్లు, రాత్రి మిగిలిన అన్నం వంటి పదార్థాలను పెట్టడంతో ఇరుకు సందుల్లో ఆవులు చేరి వాహన చోదకులకు, పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. రాత్రి సమయంలో ఆవులు గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద మైదానం, గ్రామంలో రామాలయం పక్కన, పలు చోట్ల విశాలంగా ఉన్న ప్రాంతాల్లో సేదతీరడంతో వాటి మలమూత్రాలతో ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. అయినా అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్



గంగవరం విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందు వేస్తున్న ఉపాధ్యాయులు



ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటున్న విద్యార్థులు

పెదగంట్యాడ: ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులకు చెక్ పెట్టవచ్చునని మండల విద్యాశాఖాధికారి కె.రమణాజీ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆల్బెంజల్ మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే మండలంలోని అంగన్‌డీ కేంద్రాలు, పాఠశాలలకు మాత్రలు పంపిణీ చేశామని చెప్పారు. మిగిలిన వారికి ఈ నెల 25న వేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాలతి, ఏఎన్ఎం ప్రమీల పాల్గొన్నారు.

నులిపురుగులతో రక్తహీనత

అగనంపూడి: నులిపురుగుల వల్ల రక్తహీనత సంభవించి శక్తిని కోల్పోతామని లంకెలపాలెం హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రలు అందించారు. పొట్టలో నులిపురుగులు ఉండడం వల్ల మనిషిలో బద్ధకం పెరుగుతుందని, తీసుకున్న ఆహారం జీర్ణంకాకుండా ఇబ్బంది పడతారన్నారు. ప్రతీ విద్యార్థి నులుపురుగుల నివారణకు మాత్రలు విధిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండయ్యవలస పాఠశాలలో..

నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 85వ వార్డు కొండయ్యవలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.అప్పారావు, కమిటీ ప్రతినిధులు గోపిశెట్టి రమాదేవి, మళ్ల వరలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అదనపు వర్కర్లకు జీతాలు చెల్లించండి



జీతాల సమస్యను మేయర్ హరివెంకట కుమారికి తెలియజేస్తున్న ఆనందరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న 300 మంది అదనపు వర్కర్లకు జీతాలు చెల్లించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మంగళవారం జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు అదనపు వర్కర్లతో కలిసి విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ పలు జోన్లలో గత 10 నెలలుగా, మరికొన్ని జోన్లలో 5 నెలలుగా జీతాలు వారికి జీతాలు చెల్లించడం లేదని, అలాగే పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని స్థాయీ సంఘం సభ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చూడాలని కోరారు. ఈ అంశానికి ఆమోదం తెలిపి వర్కర్స్‌కు జీతాలు చెల్లిస్తామని స్థాయీ సంఘ సభ్యులు తెలిపారని వివరించారు.

రిజిస్ట్రేషన్ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల విరాళం



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న రిజిస్ట్రేషన్ రిటైర్డ్ ఉద్యోగులు

విశాఖ సిటీ: ముఖ్యమంత్రి సహాయ నిధికి రిజిస్ట్రేషన్ శాఖ రిటైర్డ్ ఉద్యోగులు రూ.70 వేలు విరాళం అందించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి దామోదరరావు, కోశాధికారి త్రినాథరావు, సభ్యులు మురళి, శివరావు, జగదీష్, బాబ్జి, పోతురాజు, గురురాజు జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను కలిసి మంగళవారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందినప్పటికీ.. సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న వారిని అభినందించారు.

బొలిశెట్టి వ్యాఖ్యలు హేయం

సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్మిక సంఘాల నేతలను జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ హేళన చేస్తూ, చౌకబారుగా మాట్లాడడం హేయమని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పేర్కొన్నారు. ఈ మాటలు మీరు అన్నారా? లేక మీ అధినేత పవన్ కల్యాణ్ మీతో అనిపించారా? అనే సందేశించాల్సి ఉంటుందన్నారు. వెంటనే ఆయన భేషరతుగా కార్మిక సంఘాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మీ విధానం ఏంటి? ఈ మూడేళ్లలో మీరు చేసిందేంటి? ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్టీల్‌ప్లాంట్ రక్షణకు పనిచేస్తామని చెప్పారు. ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మీకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

4 గంటలు ఆలస్యంగా వందేభారత్

తాటిచెట్లపాలెం: విశాఖలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–సికింద్రాబాద్ (20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరింది. ఈ రైలు అటునుంచి 4 గంటలు ఆలస్యంగా వచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు.